క్లుప్తంగా

జనసేన జెండాలు కప్పుకున్న వారంతా టీడీపీ వారే ..


బొండా కనకారావు, సర్పంచ్, కలపాక

పరవాడ: కలపాక గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు జనసేనలో చేరినట్లు వచ్చిన కథనాల్లో వాస్తవం లేదని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఆ గ్రామ సర్పంచ్ బొండా కనకారావు చెప్పారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కూటమి నాయకులు చౌకబారు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఇటీవల జనసేన కండువాలు కప్పుకున్న వారంతా టీడీపీకి చెందిన వారేనన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పార్టీని వీడడానికి కార్యకర్తలు సిద్ధంగా లేరన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై జనసేన, టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపుతున్నారని సర్పంచ్ కనకారావు చెప్పారు.

హస్తకళలపై రెండు రోజుల శిక్షణ


హస్తకళ నిపుణులతో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు

పరవాడ: అద్భుతాలు సృజనతో సృష్టించుకోవాలని చెన్నైకి చెందిన హస్తకళ నిపుణులు మోహనుడు, గీత అన్నారు. పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో చిన్నారుల్లో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికి తీయడానికి వీలుగా రెండు రోజుల పాటు హస్తకళలపై నిర్వహించిన శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. పాఠశాల చైర్మన్ పి.సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ హస్తకళలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి మాట్లాడుతూ పురాతన కాలం నుంచి బతుకు తెరువు కోసం హస్తకళ భారతదేశ సంస్కృతిలో ఓ భాగం అయిందన్నారు. నేడు విద్యార్థి మనోవికాసానికి దోహదపడుతూ ఊహాశక్తిని పెంపొందించడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్ రామలక్ష్మి, ఆర్ట్ టీచర్ శంకర్‌నారాయణ, ఆర్ట్ క్లబ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామూహిక ఉపనయనాలు


సామూహిక ఉపనయనాల్లో పాల్గొన్న కళింగ వైశ్యులు

సింహాచలం: విశాఖ జిల్లా యువజన చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో సింహాచలం కొండ దిగువ ప్రైవేటు కల్యాణమండపంలో కళింగ వైశ్యులకు సామూహిక ఉపనయాలు ఆదివారం నిర్వహించారు. 150 మందికి ఉపనయనాలు చేశారు. తొలుత వీరంతా కొండ దిగువన వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి అక్కడి నుంచి పాత గోశాల వద్ద ఉన్న కల్యాణ మండపానికి వెళ్లారు. అక్కడ శాస్త్రోక్తంగా వారికి యజ్ఞోపవీతధారణ చేశారు. విశాఖ జిల్లా యువజన చైతన్య సేవా సంఘం అధ్యక్షుడు తలసు సాయిమోహన్, కార్యదర్శి భోగి ప్రవీణ్‌కుమార్, సంఘ ప్రతినిధులు చంద్రశేఖర్, భోగి గణేష్, వరదరాజు, దేవరశెట్టి గోవిందరావు పాల్గొన్నారు.

సర్వజన మనోరంజని వాహనంపై సింహాచలేశుడు


నృత్యప్రదర్శనలో కళాకారులు

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మూడోరోజు ఆదివారం స్వామివారికి సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధి నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేణుగోపాల స్వామిగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలను సర్వజన మనోరంజనిపై అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు సోమవారం సాయంత్రం సూర్యప్రభ వాహనంపై తిరువీధి నిర్వహించనున్నారు.

ప్రభంజనం

- చిన్నయ్యపాలెం నుంచి జననీరాజనం
- తరలివచ్చిన వేలాది మంది ప్రజలు


జై జగన్.. సీఎం జగన్ చిత్రపటంతో మహిళ


మా నమ్మకం నువ్వే.. ఫ్లెక్సీతో యువత


అభిమాన నేతపై పూల వర్షం కురిపించడానికి..


వైఎస్ జగన్‌కు స్వాగతం పలికేందుకు శ్రీరాంపురం జంక్షన్ వద్ద ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సతీమణి శిరీష


వేపగుంట జంక్షన్‌లో జనసునామీ మధ్య నుంచి అభివాదం చేస్తూ కదులుతున్న సీఎం వైఎస్ జగన్

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం బస్సు యాత్ర ద్వారా వచ్చిన సంక్షేమ రథసారథి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పెందుర్తి నియోజకవర్గ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో ఆదివారం దారి పొడవున ప్రజలు నీరాజనం పట్టారు. చిన్నయ్యపాలెంలో ప్రారంభమైన బస్ యాత్రకు బ్రహ్మరథం పట్టారు.

పెందుర్తి: చిన్నయ్యపాలెం, పినగాడి కూడలి, పినగాడి గ్రామం, శ్రీరాంపురం వద్ద రాంపురం, పెదగాడి కూడలి, చింతలగ్రహారం రైల్వే వంతెన, చింతలగ్రహారం రోడ్డు, లక్ష్మీపురం, చీమలాపల్లి, వరలక్ష్మి నగర్, వేపగుంట కూడలి, నాయుడుతోట, ఆర్ఆర్ వెంకటాపురం వరకు దారి పొడవునా ఉన్న ప్రజలకు అభివాదం చేసుకుంటూ సీఎం వైఎస్ జగన్ ముందుకు సాగారు. ఎండ మండుతున్నా జననేత కోసం ప్రజలు దాదాపు 3 గంటలకు పైగా వేచి ఉన్నారు. పెందుర్తి పట్టణం, గ్రామీణం, వేపగుంట, పరవాడ, సబ్బవరం, నరవ ప్రాంతాల నుంచి ఆటోలు, బైక్‌లతో యువకులు ర్యాలీగా తరలివచ్చారు. చిన్నయ్యపాలెంలోని రాత్రి బస నుంచి దారి పొడవునా స్వాగతం పలికారు. జై జగన్, జైజై జగన్ నినాదాలతో పెందుర్తి మార్మోగింది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు జగన్‌ను చూసేందుకు ఆరాటపడ్డారు. యువకులు బాణసంచా, తీన్‌మార్‌తో సందడి చేశారు. పార్టీ నేతలు బయిలపూడి భగవాన్ జయరామ్, పైలా శ్రీనివాసరావు, ముమ్మన దేముడు, గండి రవికుమార్, ఉప్పిలి కనకరాజు, కోడిగుడ్ల దేవిసాంబ, యతిరాజుల నాగేశ్వరరావు, చొప్పా నాగరాజు, గనిశెట్టి కనకరాజు, కొటాన రాము, కేసుబోయిన త్రినాథ్, గొరపల్లి శ్రీను, మధుపాడ అంజి, మెంటి మహేష్, సుఖవాసి సతీష్, చల్లా కనకరావు, నదీయా, చుక్కా రామునాయుడు, కోన రామారావు, బోకం రాము నాయుడు, కర్రి బాబు, పాలిశెట్టి సురేష్‌రాజ్, వనం అచ్చింనాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, చొక్కాకుల గోవింద్, కాపుశెట్టి శేషుబాబు, మనాలత జోబ్‌దాస్, దాడి ఉమామహేష్, శరగడం నరసింహమూర్తి, కిల్లి అప్పారావు, దాసరి సత్తిబాబు, గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, గొర్లె రామునాయుడు, వరంబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వేలాదిగా ప్రజలు తరలివచ్చారు.

సబ్బవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఆదివారం సబ్బవరం మండలం నుంచి ప్రారంభమైంది. అనకాపల్లి బహిరంగ సభ అనంతరం మండలంలోని చిన్నయ్యపాలెం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న టిరకాన్ రాయల్ లే అవుట్‌లో శనివారం బస చేశారు. ఆదివారం ఉదయం నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, అభిమానులు సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన తర్వాత బస్సు యాత్ర ప్రారంభమయింది. ఆయన్ను చూసేందుకు మండలంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వేలాదిగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు. బస్సు యాత్ర ప్రారంభం వద్ద కొంత మంది నుంచి వినతులు స్వీకరించారు. వారికి ఆ అభివాదం చేస్తూ ముందుకు సాగడంతో అభిమానులు, పార్టీ శ్రేణులు కేరింతలు కొట్టారు.

కళాకారుల సందడి

మండలంలోని అసకపల్లి, ఇరువాడ, తవ్వవానిపాలెం, ఎరుకునాయుడుపాలెం, యర్రవానిపాలెం గ్రామాలకు చెందిన కోలాట బృందాలు సీఎం వైఎస్ జగన్ విడిది చేసిన ప్రాంతంలో సందడి చేశాయి. కోలాటం బృందాల గురువు కర్రి రాజు బృందాలతో ముఖ్యమంత్రిని కలిసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అసకపల్లికి చెందిన నూకాంబిక కోలాటం బృందం, ఇరువాడకు చెందిన శ్రీరామ కోలాట బృందం, తవ్వవానిపాలెంకు చెందిన కోదండ రామ కోలాటం బృందం, ఎరుకునాయుడుపాలెంకు చెందిన సీతారామ కోలాటం బృందం, యర్రవానిపాలెంకు చెందిన శ్రీకృష్ణ నూకాంబిక కోలాటం బృందం సందడి చేశాయి.


అంతులేని అభిమానం.. సీఎం జగన్‌ను చూడడానికి మండుటెండలో వచ్చిన దివ్యాంగుడు


ముఖ్యమంత్రికి స్వాగతం పలకడానికి సిద్ధంగా తవ్వవానిపాలెం కోలాటం బృందం


ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చూసేందుకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు


ఎండ మండుతున్నా.. తరగని అభిమానం


అదిగో.. జగన్ మామయ్యా..


ఎలాగైనా అభిమాన నేతను చూడాలని..

అభాగ్యులకు భరోసా

పెందుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి పెద్ద మనసు చాటుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించి వారికి కావల్సిన వైద్య సదుపాయాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. మేమంతా సిద్ధం బస్ యాత్రలో భాగంగా సీఎం జగన్‌ను కలిసి తమ గోడు చెప్పుకొన్న బాధితులకు అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కొండంత అండ దొరికింది



నా పేరు కోరుబిల్లి కళావతి. నా భర్త శేఖర్ దినసరి కూలీ. మా పాప పరిమళకు 12 ఏళ్లు. వయసుకు తగ్గ మెదడు పెరగకపోవడంతో పాప ఎదుగుదల పూర్తిగా ఆగిపోయింది. చాలా ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా ఫలితం లేదు. దాంతోపాటు మా ఆయన శేఖర్‌కు ఫిట్స్ సమస్య వచ్చింది. ఇప్పుడు ఇద్దరి వైద్యానికి చాలా ఖర్చు అవుతుంది. ఈ రోజు మా ఊరు వచ్చిన జగనన్నకు మా పరిస్థితి చెప్పుకున్నాం. ఆయన వెంటనే స్పందించి వైద్యానికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. రిపోర్ట్‌లు అన్నీ వారికి అందించాం. త్వరలోనే ఎక్కడ వైద్యం చేస్తారో చెబుతామన్నారు. సీఎం గారిని కలవడంతో మాకు కొండంత అండ దొరికింది.

– కోరుబిల్లి కళావతి

వైద్యానికి చింత లేదిక



జీవీఎంసీ 88వ వార్డు వెదుళ్ల నరవకు చెందిన సర్వసిద్ధి దుర్గా ప్రసాద్ ఏడాది కిందట కొబ్బరి చెట్టు మీద నుంచి పడిపోయాడు. దీంతో మెడ దగ్గర నరాల చిట్లడంతో శస్త్ర చికిత్సకు శరీరం సహకరించడంలేదు. ఏడాదిగా అతడు మంచం మీదే ఉన్నాడు. మెరుగైన వైద్యం అందించేందుకు కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో ముందుకు వెళ్లలేని పరిస్థితి. ఈ క్రమంలో ఆదివారం పెందుర్తి మండలం రాంపురం వద్ద సీఎం వైఎస్ జగన్‌కు దుర్గాప్రసాద్‌ను చూపించిన కుటుంబ సభ్యులు పరిస్థితిని వివరించారు. దుర్గా ప్రసాద్‌కు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ హరికృష్ణకు సీఎం వైఎస్ జగన్ సూచించారు.

దివ్యాంగ కవల సోదరుల చదువుకు భరోసా

రాంపురానికి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌ను పెందుర్తికి చెందిన దివ్యాంగ కవల సోదరులు జి.జీవన్‌కుమార్, జి.తరుణ్‌కుమార్ ట్రైసైకిల్‌పై వచ్చి కలిశారు. దివ్యాంగులమైనా కష్టపడి చదువుకుంటున్నామని సీఎంకు వివరించారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో తనకు 815 మార్కులు వచ్చాయని జీవన్‌కుమార్ సీఎంకు చెప్పాడు. దీంతో సీఎం వారిని అభినందిస్తూ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇద్దరి సోదరుల చదువుకు కావాల్సిన సహాయం అందిస్తామని సీఎం జగన్ భరోసా ఇచ్చారు.



'మేమంతా సిద్ధం'కు తరలిన శ్రేణులు

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు స్వాగతం పలకడానికి పెందుర్తి కూడలికి ఆదివారం పరవాడ మండల నలుమూలల నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు ఆధ్వర్యంలో పరవాడ, పి.బోనంగి, సమ్మెంగపాలెం, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, వాడచీపురుపల్లి, రావాడ, వెన్నలపాలెం, భర్నికం, తానాం, గొర్లివానిపాలెం, బొద్దపువానిపాలెం, కన్నూరు, సాలాపువానిపాలెం, పెదముషిడివాడ తదితర పంచాయతీల నుంచి సుమారు ఐదు వేల మంది నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, బొంది అచ్చిబాబు, తిక్కాడ సత్యనారాయణ, కూండ్రపు సీతారామయ్య, మండల జేసిఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, ఎం.ఎం.నాయుడు, పైల రేగారావు, పెదిశెట్టి శేఖర్, కబడ్డి అప్పారావు, సత్యనారాయణ, నందవరపు శ్రీనివాసరావు, లక్ష్మీప్రసాద్, వై.బుజ్జి, గొల్లవిల్లి శ్రీను, కూండ్రపు తాతాజీ, డెక్క శ్రీనివాసరావు, కప్పరాడ శ్రీను, ఎం.సంజీవరావు, బండారు భాస్కర్రావు తదితరులు ఉన్నారు.


సీఎం జగన్ బస్సుయాత్రకు తరలివెళ్లిన పి.బోనంగి నాయకులు, కార్యకర్తలు


సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలకడానికి తరలి వెళ్లిన సమ్మెంగపాలెం నాయకులు, కార్యకర్తలు


వెన్నలపాలెం నుంచి..


98వార్డు అప్పన్నపాలెం నుంచి తరలివెళ్తున్న పీతల విష్ణుమూర్తి తదితరులు

దారులన్నీ వేపగుంట వైపే...

సింహాచలం: జీవీఎంసీ 94వవార్డు వేపగుంట కూడలికి చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు స్వాగతం పలికేందుకు 98,93వవార్డుల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లారు. అప్పన్నపాలెం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకుడు పీతల విష్ణుమూర్తి, జగదీష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వేపగుంట తరలివెళ్లారు. 93వవార్డు నుంచి దాసరి సత్తిబాబు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు వేపగుంట కూడలికి చేరుకున్నారు.

చందనోత్సవంలో కీలక భూమిక పోషించాలి

స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఈవో శ్రీనివాసమూర్తి


స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్షిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: ఏటా వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిర్వహించే చందనోత్సవంలో భక్తులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయమని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి కొనియాడారు. వచ్చే నెల 10న చందనోత్సవం పురస్కరించుకుని ఆరోజు భక్తులకు సేవలందించే స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో ఆదివారం ఈవో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది కూడా పెద్ద ఎత్తున స్వచ్ఛంద సంస్థలు భక్తులకు మంచినీరు, మజ్జిగ, గ్లూకోజ్ వాటర్, సీతల పానియాలు, బిస్కట్లు, ఆహార పదార్థాలు అందించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఏయే ప్రదేశాల్లో ఏ సంస్థలు సేవలందిస్తాయో నమోదు చేసుకున్నారు. దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి, రాజేంద్ర, నరసింగరావు, డీఈ నాగేశ్వరరావు, ఏఈలు హరి, తాతాజీ పాల్గొన్నారు.

4 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ: తానాం గ్రామానికి చెందిన అల్లు రామారావు ఆదివారం అక్రమంగా నాలుగు మద్యం సీసాలు (750 ఎంఎల్) తరలిస్తుండగా ఏఎస్ఐ బీవై నాయుడు పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

కేంద్రం తీరుతోనే స్టీల్ ప్లాంట్‌కు సమస్యలు

- రాజకీయ పార్టీలు స్పష్టమైన వైఖరిని తెలియజేయాలి
- 'మహాగర్జన' లో పోరాట కమిటీ నాయకులు


మాట్లాడుతున్న సీహెచ్ నర్సింగరావు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్లనే ఉక్కు పరిశ్రమ నేడు సమస్యలను ఎదుర్కొంటోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ కార్మికులు చేస్తున్న ఉక్కు పోరాటానికి మద్దతు తెలిసిన ప్రతీ రాజకీయ పార్టీ తమ స్పష్టమైన వైఖరిని తెలియజేయాలని కోరారు. పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఉక్కు పరిశ్రమకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1165వ రోజు ఆదివారం నిర్వహించిన మహాగర్జనలో పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు, కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఇదే సరైన సమయం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గంపై చేస్తున్న దాడిని ప్రతిఘటించడానికి ఇదే సరైన సమయం అని, తమ ఓటు హక్కు ద్వారానే నిరసనను తెలియజేస్తామని నాయకులు అన్నారు. సంస్థకు ముడి సరుకులు అందించకుండా నష్టాల బాట పట్టించి, తద్వారా సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలనే వ్యూహం రచించడం అన్యాయమన్నారు. దీనిని కార్మికులందరూ ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు సీహెచ్ నర్సింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు, యు.రామస్వామి, మస్తాన్‌రావు, కారు రమణ, డి.వి.రమణారెడ్డి, వరసాల శ్రీనివాస్, డి.సురేష్‌బాబు, పరంధామయ్య, కరణం సత్యారావు, శ్రీనివాసులు నాయుడు, నమ్మి సింహాద్రి, ఆడారి ఆప్పారావు, స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

యారాడ తీరంలో సినిమా సెట్


తీరంలో సినిమా షూటింగ్ కోసం వేసిన సెట్

పెదగంట్యాడ: విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రానికి సంబంధించి యారాడ తీరంలో షూటింగ్ జరగనుంది. ఈ నెలాఖరు నుంచి ఇక్కడ షూటింగ్ ప్రారంభం కానుండడంతో తీరంలో వేసిన సెట్ పర్యాటకులను ఆకర్షిస్తోంది.